సాక్షి

ములుగు

మంగళవారం । 5 । మార్చి । 2024



పరుగో..పరుగు..

జీరో బిల్లు రాని విద్యుత్ వినియోగదారులు మండల, మున్సిపల్ కార్యాలయాల వైపు పరుగులు పెడుతున్నారు.

- 8లో▸



మంత్రాల పెట్టె పేరుతో..

మంత్రాల పెట్టె పేరుతో అమాయకుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ దామోదర్‌రెడ్డి తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$36^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ అధికంగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పగిడిద్దరాజు జాతరను విజయవంతం చేయాలి



ఎస్‌ఎస్ తాడ్వాయి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గుండాల మండలం పరిధిలోని యాపలగడ్డలో ఈ నెల 6నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న పగిడిద్దరాజు జాతరను విజయవంతం చేయాలని మేడారం జాతర కమిటీ చైర్మన్ లచ్చుపటేల్ కోరారు. మండల పరిధిలోని మేడారంలో పగిడిద్దరాజు జాతర పోస్టర్‌ను వనదేవతల సన్నిధిలో పూజారులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెం వంశీయుల ఇలవేల్పు అయిన పగిడిద్దరాజు జాతరను అరెం వంశీయుల అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూజారులు సిద్దబోయిన స్వామి, రమేష్, రాజు, తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, నాయకులు సొలం నందు, చింత సతీష్, ఈక రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

డీఏ బిల్లులు చెల్లించాలి

ములుగు రూరల్: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించక ముందే ఉద్యోగులకు డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు అడ్డంకిగా ఉన్న టెట్‌పై ప్రభుత్వం తక్షణం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వేతనాల చెల్లింపుపై హర్షం

ములుగు రూరల్: రాష్ట్రంలో నాల్గో తరగతి ఉద్యోగుల వేతనాలను సకాలంలో చెల్లించడాన్ని హర్షిస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ములుగులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎన్ని నెలలకు వేతనం వస్తుందో తెలియక సతమతమయ్యే పరిస్థితి ఉండేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెలా ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం: ఒకటో తరగతి ప్రవేశాల కోసం గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు, జయశంకర్ జిల్లాలోని 12 మంది గిరిజన విద్యార్థులకు హైదరాబాద్‌లోని బేగంపేట, రామాంతపూర్‌లోని ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఒకటో తరగతిలో ఉచితంగా చదివేందుకు 12మంది విద్యార్థులకు సీట్లను కేటాయించనున్నట్లు వివరించారు. ఇందుకోసం రెండు జిల్లాల్లోని గిరిజన విద్యార్థులు ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు ఆదాయం ఉండాలని పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. విద్యార్థులు 1 జూన్ 2017 నుంచి 31మే 2018 తేదీలోపు జన్మించిన వారై ఉండాలని తెలిపారు. సర్టిఫికెట్లతోపాటు దరఖాస్తులను ఈనెల 11వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఐటీడీఏ గిరిజన విద్యాశాఖ విభాగ కార్యాలయంలో ఇవ్వాలని పేర్కొన్నారు. దరఖాస్తులను డ్రా తీసి సీట్లను కేటాయిస్తామని వివరించారు.

డిగ్రీ కళాశాలలో..

ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలో 2024–25 ప్రథమ సంవత్సరంలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులం సెట్ కామన్ ఎంట్రన్స్ పరీక్షకు ఈ నెల 12వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెల 24వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.


నేడు ఎమ్మెల్యే పర్యటన

రేగొండ(కొత్తపల్లిగోరి): భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కొత్తపల్లిగోరి మండల పరిధిలో మంగళవారం పర్యటించనున్నారు. మండలకేంద్రంలోని రావులపల్లిలో సీసీ రోడ్డు శంకుస్థాపన, విజ్జయ్యపల్లి, వెంకటేశ్వర్లపల్లి, గాంధీనగర్ గ్రామాలలో గ్రామపంచాయతీ భవనాల శంకుస్థాపనకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప కాయల నర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆశావహుల ఆరాటం

పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచేందుకు పలువురి లాబీయింగ్

- వరంగల్, మానుకోట స్థానాలపై ప్రధాన పార్టీల దృష్టి
- గెలుపే లక్ష్యంగా బలమైన అభ్యర్థుల కోసం కసరత్తు
- మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఖరారు
- త్వరలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులపై క్లారిటీ
- హైదరాబాద్, ఢిల్లీలో ఆశావహుల మకాం



సాక్షిప్రతినిధి, వరంగల్: పార్లమెంట్ ఎన్నికల బరిలో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి తలపడేందుకు ఆశావహులు ఆరాటపడుతున్నారు. హైదరాబాద్, ఢిల్లీలో మకాం వేసి ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో గెలుపు గుర్రాలను రంగలోకి దింపడంపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. ఆ మేరకు అధిష్టానాలు వడబోతను చివరిదశకు తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవడంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ.. గెలుపే లక్ష్యంగా బలమైన అభ్యర్థులను బరిలోకి దింపే పనిలో ఉన్నాయి. బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మహబూబాబాద్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితకే మళ్లీ అవకాశం ఇచ్చారు. వరంగల్ అభ్యర్థిపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. తొలి జాబితా ప్రకటించిన బీజేపీ.. కాంగ్రెస్ పార్టీలు సైతం త్వరలోనే ఈ రెండు స్థానాల అభ్యర్థులపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.

వరంగల్ కోసం పోటాపోటీ..

వరంగల్ పార్లమెంట్ కిందకు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఈ ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు, నాలుగు జిల్లాలకు చెందిన నాయకులు వరంగల్ టికెట్ ఆశించే అవకాశం ఉంది. దీంతో అన్ని పార్టీల్లో ఆశావహుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థిని ప్రకటించగా వరంగల్‌పై సస్పెన్స్ కొనసాగుతోంది. వరంగల్ అభ్యర్థి ఎంపిక అధిష్టానానికి తలనొప్పిగా మారింది.వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ సీనియర్‌గా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతుండగా.. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన కూతురు కడియం కావ్యకు ఇవ్వాలంటున్నట్లు ప్రచారం. హనుమకొండ జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత డాక్టర్ మారెపెల్లి సుధీర్‌కుమార్ కూడా గట్టిగా పట్టుపడుతున్నారు. కేయూ ఉద్యమ నాయకులు జోరిక రమేష్, వీరేందర్, బోడ డిన్న, బండి రజని సోమవారం ప్రెస్‌మీట్ పెట్టి నలుగురిలో ఒకరికి వరంగల్ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురి పేర్లు ఇప్పటికే అధిష్టానానికి పంపారన్న ప్రచారం ఉంది. ఆ పార్టీ నుంచి అద్దంకి దయాకర్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, దొమ్మాటి సాంబయ్య, హరికోట్ల రవి, నమిండ్ల శ్రీనివాస్, సింగపురం ఇందిర, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణతో పాటు పలువురు ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ నుంచి మాజీ ఐపీఎస్ అధికారి, రిటైర్డు డీజీపీ కృష్ణప్రసాద్, మంద కృష్ణమాదిగ, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బొజ్జపల్లి సుభాష్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే పార్టీలో చేరితే ఆయనకే చాన్స్ దక్కనున్నట్లు సమాచారం.

మానుకోట కోసం మహామహులు..

బీఆర్‌ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా మళ్లీ మాలోతు కవితకే ఆ పార్టీ అవకాశం ఇవ్వగా.. కాంగ్రెస్, బీజేపీల నుంచి ఆశావహులు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. మానుకోట ఎస్టీ రిజర్వుడ్ సీటు కోసం కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొంది. స్వరాష్ట్ర ఆవిర్భావం అనంతరం దశాబ్ద కాలం తర్వాత అధికారం చేపట్టిన తెలంగాణ కాంగ్రెస్‌లో మహబూబాబాద్ ఎంపీ టికెట్ దక్కించుకుంటే చాలు.. విజయం ఖాయమన్న సంకేతాలతో ఆశావహులు భారీ స్థాయిలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ పేరు ప్రధానంగా వినిపిస్తుండగా.. ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ రిజిస్ట్రార్ భట్టు రమేష్, రిటైర్డ్ ఎక్సైజ్ అధికారి బానోత్ మోహన్‌లాల్, ఐపీఎస్ అధికారి నాగరాజునాయక్, డాక్టర్ శంకర్‌నాయక్, లకావత్ లక్ష్మీనారాయణనాయక్ తదితరుల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఇక బీజేపీ నుంచి జాటోతు హుస్సేన్‌నాయక్, కృష్ణవేణి నాయక్ పేర్లు ప్రధానంగా వినిపిస్తుండగా.. మరో ఆరుగురు మహబూబాబాద్ సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ ఇప్పటికే మహబూబాబాద్ అభ్యర్థిని ప్రకటించగా, త్వరలోనే కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థులను ఖరారు చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

కవితకే మళ్లీ మానుకోట టికెట్

- ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన బీఆర్‌ఎస్



సాక్షి,మహబూబాబాద్: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితను బీఆర్‌ఎస్ మరోసారి బరిలోకి దింపుతోంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సోమవారం ప్రకటించారు. డోర్నకల్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ కూతురు మాలోత్ కవిత. తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న ఆమె 2009లో మహబూబాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆమె ఎమ్మెల్యేగా పోటీ చేసి బీఆర్‌ఎస్(అప్పటి టీఆర్‌ఎస్) అభ్యర్థి శంకర్‌నాయక్ చేతిలో ఓటమి పాలయ్యారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా బీఆర్‌ఎస్‌లో చేరిన కవిత 2019 జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ అభ్యర్థిగా పోటీ చేసి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌పై విజయం సాధించారు.

క్రీడా పోటీల్లో సత్తాచాటాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: మహిళలు ఉద్యోగం, ఇంటి బాధ్యతలతోపాటు క్రీడాపోటీల్లోనూ పాల్గొని సత్తా చాటాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజతో కలిసి సోమవారం గిరిజన భవన్‌లో మహిళా ఉద్యోగుల క్రీడాపోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి చెస్, షటిల్ ఆడి మహిళా ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం వరకు చెస్, క్యారమ్స్, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, స్కిప్పింగ్, షటిల్, టెన్నికాయిట్, అంతాక్షరి, టగ్ ఆఫ్ వార్ వంటి ఇండోర్ గేమ్స్ ఉంటాయని తెలిపారు. మహిళా ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో మెదగాలని సూచించారు. స్నేహపూరిత వాతావరణంలో క్రీడలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పీఈటీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ స్వర్ణలతలెనినా, జిల్లా మైనార్టీ అధికారి ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.



చెస్ ఆడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగు: ఈ నెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) సీహెచ్.మహేందర్‌జీ సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సోమవారం సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 3,092 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 200మంది ఇన్విజిలేటర్లు, 21 మంది చీఫ్ సూపర్‌వైజర్లు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. ఇన్విజిలేటర్లు సైతం ఫోన్‌లు వినియోగించకూడదన్నారు. పోలీస్ సిబ్బందికి పరీక్ష హాల్‌లోకి వెళ్లే అనుమతిలేదని తెలిపారు. పరీక్ష జరుగుతున్న సమయంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ కేంద్రం వద్ద వైద్య సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల నుంచి విద్యార్థులను సకాలంలో కేంద్రాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పాణిని, డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, డీఎల్‌పీఓ స్వరూప, సైన్స్ అధికారి జయదేవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న మహేందర్‌జీ

కాళేశ్వరంలో పార్కింగ్ స్థలాల చదును

కాళేశ్వరం: కాళేశ్వరంలో ఈనెల 7నుంచి 9వరకు జరుగు మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల వాహనాలను నిలిపేందుకు నాలుగు చోట్ల పార్కింగ్ స్థలాలను పంచాయతీ, పోలీసు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే వారికోసం హరితహోటల్ సమీపంలో వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి మీదుగా వచ్చే వారి కోసం హనుమాన్ ఆలయం వద్ద, ఇప్పటబోరు వద్ద, వీఐపీ ఘాటు వద్ద నాలుగు చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు లక్షవరకు భక్తులు శివరాత్రి ఉత్సవాలకు తరలిరానున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు.



పార్కింగ్ స్థలాలను చదును చేస్తున్న దోజర్

నాయకపోడ్, ముదిరాజ్‌ల వాగ్వాదం



గట్టమ్మ ఆలయం వద్ద గుమికూడిన ఇరువర్గాలు



చేతికి గాయమైన గట్టమ్మ పూజారి లక్ష్మి

- గట్టమ్మ వద్ద పరస్పర దాడులు
- అడ్డుకున్న పోలీసులు

ములుగు రూరల్: ములుగు మండలంలోని గట్టమ్మ ఆలయం వద్ద ఆదివాసీ నాయకపోడ్‌లు, ముదిరాజ్ సంఘం నాయకులు పరస్పరం వాగ్వాదానికి దిగడంతో పాటు దాడులకు పాల్పడ్డారు. సోమవారం గట్టమ్మ ఆలయంలో ఎప్పటిలాగే ములుగు గ్రామానికి చెందిన ఆదివాసీ నాయకపోడ్‌లు పూజారులుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో జాకారానికి చెందిన ముదిరాజ్‌లు మేము ఆలయ పూజారులమంటూ గొడవకు దిగారు. దీంతో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఈ క్రమంలో ఆదివాసీ మహిళా పూజారి కొత్త లక్ష్మికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న సీఐ రంజిత్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్, రెండో ఎస్సై రామకృష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి గొడవను నివారించారు.

1954నుంచి నాయకపోడ్‌ల పూజలు..

ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ మాట్లాడుతూ 1954 నుంచి తమ తాతలు, తండ్రులు గట్టమ్మ ఆలయంలో పూజారులుగా వ్యవహరిస్తూ వస్తున్నారని తెలిపారు. రాజకీయ నాయకుల కుట్రలో భాగంగా గట్టమ్మ ఆలయం జాకారం పరిధిలో ఉందని సర్వేలో వచ్చిందన్నారు. అప్పటి నుంచి జాకారం ముదిరాజ్‌లతో ప్రతీ జాతర సమయంలో గొడవలు జరుగుతున్నాయన్నారు. అయినప్పటికీ ఆదివాసీ నాయకపోడ్‌లు సాంప్రదాయాల మేరకు గట్టమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

2015లో ముదిరాజ్‌లకు అనుకూలంగా తీర్పు

ఈ విషయంపై ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈర్ల చేరాలు మాట్లాడుతూ ప్రతీ జాతర సమయంలో నాయకపోడ్‌లకు, ముదిరాజ్‌లకు గొడవ కారణంగా కోర్టును ఆశ్రయించామన్నారు. 2015లో హైకోర్టు గట్టమ్మ ఆలయం జాకారం పరిధిలో ఉందని పూర్తి అధికారాలు జాకారం గ్రామ పంచాయతీ, ముదిరాజ్‌లకు ఉంటాయని తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఆదివాసీ నాయకపోడ్ సంఘం నాయకులు అధికారులను తప్పుతోవ పట్టించి ఆలయ పూజారులుగా కొనసాగుతున్నారని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులను అధికారులు తక్షణమే కొనసాగించాలన్నారు. ఆలయంలో పూజారులుగా కొనసాగుతున్న ఆదివాసీలపై జాకారం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు దాడి చేయడం సరికాదని దాడిని ఖండిస్తున్నామని పోడు దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బా సుధాకర్ అన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు

గట్టమ్మ ఆలయం వద్ద పూజారులుగా కొనసాగుతున్న ఆదివాసీ నాయకపోడ్‌లపై దాడికి పాల్పడిన జాకారం ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్తులపై ములుగు ఎస్సై వెంకటేశ్వర్ కేసు నమోదు చేశారు. ఆదివాసీ నాయకపోడ్ పూజారులను గాయపరిచారని పూజారుల సంఘం అధ్యక్షుడు కొత్త సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళల పాత్ర గొప్పది

భూపాలపల్లి రూరల్: కుటుంబ బాధ్యతలను ఓపికగా నిర్వర్తించడంలో మహిళల పాత్ర గొప్పదని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లాకేంద్రంలోని సఖికేంద్రంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు తమ కుటుంబాలను నడిపించడంతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలకు సమస్యలు వస్తే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పోక్సో పబ్లిక్ ప్రాసిక్యూటర్ విష్ణు వర్ధన్‌రావు, సఖి కేంద్రం నిర్వాహకురాలు గాయత్రి, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి జయరాంరెడ్డి

వినతులు విన్నవించాం.. పరిష్కరించండి

- కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహణ
- వినతులు స్వీకరించిన కలెక్టర్ త్రిపాఠి

ములుగు: పలు సమస్యలపై వినతులు విన్నవించాం... త్వరితగతిన పరిష్కరించండి అంటూ ప్రజావాణిలో వినతులు సమర్పించిన బాధితులు వేడుకుంటున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్లు శ్రీజ, సీహెచ్.మహేందర్‌జీతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో 35 దరఖాస్తులు రాగా అందులో 30 రెవెన్యూ, మరో ఐదు ఇతర సమస్యలపై వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వాటిని కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి సకాలంలో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ నెల 7వ తేదీన మంత్రి సీతక్క, జిల్లా, నియోజకవర్గ సమావేశాలు నిర్వహించనున్నారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు నివేదికలను సిద్ధం చేసి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, షెడ్యూల్డ్ కులాల అధికారి తుల రవి, ఎల్‌డీఎం రాజ్‌కుమార్, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీన, డీఎల్‌పీఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ త్రిపాఠి

గిరిజన దర్బార్‌లో పీఓ చిత్రామిశ్రా వినతుల స్వీకరణ

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన గ్రామాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సెక్టార్ అధికారులు దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా అన్నారు. ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పీఓ గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం పలు సమస్యలపై వచ్చిన వినతులు పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి వాటికి పరిష్కారం చూపాలని ఆదేశించారు. గతంలో ఉన్న పెండింగ్ వినతుల వివరాలను ఏఓ దామోదరస్వామిని అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ పరిధిలో 22, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగంలో 12, ఇతర శాఖలకు సంబంధించి 12 వరకు పెండింగ్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌కు 29 వినతులు రాగా ఇలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన గవిడి రాధిక తనకు నర్సు పోస్టు ఇప్పించాలని వేడుకున్నారు. ఏటూరునాగారం మండలం బూటారం గ్రామానికి చెందిన యాలం శ్యామ్‌కుమార్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పించాలని విన్నవించారు. తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన ఊకె మౌనిక కులాంతర వివాహం చేసుకున్నానని, తనకు ఇంటి స్థలం ఇప్పించాలని పీఓకు మొరపెట్టుకున్నారు. టీఎస్‌పీఎస్‌సీలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపిక అయ్యాయని తనకు ఏజెన్సీ సర్టిఫికెట్ కోసం డీఎల్‌ఎస్‌సీ ఫైల్‌ను కలెక్టర్‌కు అప్రోవల్ కోసం పంపాలని వట్టం సతీష్‌కుమార్ పీఓకు మొరపెట్టుకున్నారు. మంగపేట మండలం రేగులగూడెంకు చెందిన పల్టియా సురేష్, జేష్, గంగయ్యలు తమకు గిరివికాసం పథకం కింద బోర్లు మంజూరు చేయాలని కోరారు. ఇలా పలువురు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీఓకు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీ పోచం, ఏఓ దామోదరస్వామి, ఎస్‌ఓ రాజ్‌కుమార్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ క్రాంతికుమార్, మేనేజర్ శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న పీఓ

దళితబంధు అమలుచేయాలి



భూపాలపల్లి రూరల్: రెండో విడత దళితబంధు నిధులను వెంటనే అందించాలని కోరుతూ సోమవారం లబ్ధిదారులు జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకం కోసం జమ చేసిన నిధులను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని.. పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెండవ విడత దళిత బంధులబ్ధిదారులు,దళిత సంఘాల నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

హైకోర్టు రిటైర్డ్ జడ్జి పూజలు

కాళేశ్వరం: కాళేశ్వరంలోని ముక్తీశ్వరస్వామిని హైకోర్టు రిటైర్డ్ జడ్జి నారాయణ, కాళేశ్వరం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు టి.ప్రభాకర్ వేర్వేరుగా దర్శించుకున్నారు. సోమవారం ఆలయ రాజగోపురం వద్దకు రాగా వారికి దేవస్థానం పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదములు అందజేశారు.



రిటైర్డ్ జడ్జి దంపతులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకుడు

ఆస్పత్రిలో ఉచిత భోజనం

భూపాలపల్లి రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిలో ప్రతిరోజు మధ్యాహ్నం ఉచిత భోజనం అందిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి తెలిపారు. సోమవారం ఆస్పత్రిలో మధ్యాహ్నం అవుట్ పేషెంట్లతో పాటు రోగుల వెంట వచ్చిన వారి బంధువులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడారు. ఆస్పత్రికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రోగులు, వారి బంధువులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసి ఉచిత భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అటవీ ప్రాంతంపై ఎగిరిన విమానం

● భయాందోళనలో గ్రామాల ప్రజలు



మహాముత్తారం: మావోల ఏరివేతకు పోలీస్‌శాఖ పూర్తిస్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటోంది. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల పరిధి కనుకునూర్, రెడ్డిపల్లి, బోర్లగూడెం అటవీ ప్రాంతాల్లో తక్కువ ఎత్తునుంచి మినీ విమానం చక్కర్లు కొట్టింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పోలీస్ ఉన్నతాధికారిని వివరణ కోరగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం పోలీస్ ట్రెయినింగ్ సెంటర్‌కు సంబంధించిన విమానమని పేర్కొన్నారు.

కేయూలో పార్ట్‌టైం అధ్యాపకుల ధర్నా



కేయూ క్యాంపస్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ఆయా అధ్యాపకులు సోమవారం కూడా ఆందోళన చేపట్టారు. పరిపాలనభవనం వద్ద బైఠాయించి ధర్నా చేశారు. 16 పీరియడ్‌లు కలిగిన పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని ,మిగతా పార్ట్‌టైం అధ్యాపకులకు పీరియడ్‌కు రూ.700 నుంచి రూ. వెయ్యి వరకు వేతనం పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఈ విషయం తెలుసుకున్న కేయూ వీసీ రమేష్ ఘటనా స్థలికి చేరుకుని అధ్యాపకులతో మాట్లాడారు. పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు తనకు తెలుసని, ప్రభుత్వం అనుమతిస్తే తాను పరిష్కరించేందుకు సిద్ధమని హామీ ఇచ్చారు. దీంతో పార్ట్‌టైం అధ్యాపకులు ఆందోళన విరమించారు. కాగా, సోమవారానికి తమ ఆందోళన విరమిస్తున్నట్లు కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు వై రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ నరేందర్‌నాయక్, బాధ్యులు దేవోజి నాయక్, భాగ్యమ్మ, తిరుణహరిశేషు, ఇ రమేష్, కె లక్ష్మినారాయణ, మాధవి, రమాదేవి, నవీన్, సదానందం, నాయిని వినీత ,భిక్షపతి, సరితజ్యోత్స్న, సంజీవ్, హరికుమార్, రవీందర్ రెడ్డి, శ్రీధర్ సాయి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పరుగో.. పరుగు

విద్యుత్ జీరో బిల్లు రాలేదని ఆఫీస్‌ల బాట పట్టిన వినియోగదారులు

● గృహాలకు 200 యూనిట్లు ఉచితం
● కొనసాగుతున్న బిల్లుల జారీ ప్రక్రియ
● ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12,03,156 మంది గృహ వినియోగదారులు



బల్దియాలో బారులుదీరిన లబ్ధిదారులు

హన్మకొండ: జీరో బిల్లు రాని విద్యుత్ వినియోగదారులు మండల, మున్సిపల్ కార్యాలయాల వైపు పరుగులు పెడుతున్నారు. గృహజ్యోతి పథకంలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన వినియోగదారులకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి విద్యుత్ సంస్థ జీరో బిల్లుల జారీ చేపట్టింది. గత నెలలో బిల్లుల జారీ చేసిన క్రమంలో వినియోగదారుల తెల్లరేషన్, ఆధార్ కార్డుల నంబర్లను విద్యుత్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12,03,156 గృహ విద్యుత్ వినియోగదారులున్నారు. ఈ క్రమంలో గత నెలలో 4,25,300 మంది వినియోగదారుల సర్వీస్ నంబర్లకు తెల్ల రేషన్, ఆధార్ కార్డుల నంబర్లను అనుసంధానం చేశారు. వీరిలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించిన వినియోగదారులకు జీరో బిల్లు జారీ చేస్తున్నారు. సోమవారం నాటికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51,035 మందికి జీరో బిల్లులు జారీ చేశారు. అయితే జీరో బిల్లు రాని, తెల్ల రేషన్ కార్డు కలిగిన వినియోగదారులు తమ వివరాలు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. తెల్లరేషన్, ఆధార్ కార్డుల నంబర్లు, ఫోన్ నంబర్, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నంబర్ వివరాలతో కూడిన ప్రజాపాలన దరఖాస్తును గ్రామీణ ప్రాంతాల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయం, పట్టణాలు, నగరాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో అందించాల్సి ఉంటుంది. వీరి వివరాలను ఆయా కార్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతాయి. కాగా, 200 యూనిట్ల తర్వాత ఒక్క యూనిట్ అధికంగా వినియోగించినా వినియోగదారుడు మొత్తం బిల్లు చెల్లించాలి. 200 వరకు మాత్రమే జీరో బిల్లు వస్తుంది. 201 నుంచి జీరో బిల్లు రాదు. ఒక్క యూనిట్ అదనంగా విద్యుత్ వాడినా మొత్తం యూనిట్లకు బిల్లు చెల్లించాలి.

వినియోగదారుల వివరాలు..

జిల్లా	మొత్తం వినియోగదారులు	మొదటి విడత వర్తించే వినియోగదారులు	ఇప్పటి వరకు జీరో బిల్లుల జారీ
హనుమకొండ	3,45,302	92,763	12,192
వరంగల్	2,86,156	95,483	9,934
భూపాలపల్లి, ములుగు	93,257	75,816	7793
జనగామ	1,69,375	74,575	13,616
మహబూబాబాద్	2,09,066	86,663	7500

సీకేఎంలో ఉమెన్స్ డే సెలబ్రేషన్స్



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

వరంగల్: దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాలలో సోమవారం లైబ్రరీ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.శశిధర్‌రావు మాట్లాడుతూ ప్రతికూల ఘటనలు ఎదురైనప్పుడు కృంగిపోకుండా ఆ సమయంలో చదివే పుస్తకం, వినే సంగీతం, చూసే దృశ్యం ధైర్యం ఇస్తాయన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా ఎదుర్కొని నిలదొక్కుకోవాలన్నారు. అంతేగాని ఆత్మహత్యలకు పాల్పడొద్దన్నారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు సమాజంలో మహిళలపై జరిగే ఆకృత్యాలను మాటలు, పాటలు, కవితల రూపంలో వివరించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కళాశాల తరఫున సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ధర్మారెడ్డి, ఆర్గనైజర్స్ లైబ్రరీ అనిల్, సుమలత, మోహన్, కుమార్, కెప్టెన్ సతీష్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు అయోధ్యకు ప్రత్యేక రైలు



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ నుంచి నేడు (మంగళవారం) కాజీపేట–అయోధ్య(ఆస్థా)కు ప్రత్యేక రైలును నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. కాజీపేట జంక్షన్ నుంచి సాయంత్రం 6:20 గంటలకు ఈ రైలు బయలుదేరి అయోధ్యకు వెళ్తుందన్నారు. రామమందిరం సందర్శన కోసం ఈ రైలుకు ముందే రిజర్వేషన్ బుకింగ్ చేసుకున్న వారు మాత్రమే ప్రయాణం చేస్తారని, కాజీపేట జంక్షన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్‌లో ఈ రైలుకు టికెట్ ఇవ్వరని వారు తెలిపారు.

మారథాన్ మాణిక్యాలు..

● ప్రపంచ పరుగు పోటీల్లో రాణిస్తున్న డాక్టర్ దంపతులు



మెడల్స్‌తో డాక్టర్ సుధాకర్, డాక్టర్ తులసి

హన్మకొండ: హనుమకొండకు చెందిన డాక్టర్ దంపతులు సుధాకర్, తులసి వరల్డ్ మారథాన్(పరుగు) పోటీల్లో రాణిస్తున్నారు. ఒక పక్క వృత్తి (డెంటల్) కొనసాగిస్తూనే మరో పక్క వివిధ దేశాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న జపాన్ రాజధాని టోక్యోలో జరిగిన వరల్డ్ మారథాన్ పోటీల్లో పాల్గొని 42.4 కిలో మీటర్ల పరుగును పూర్తి చేసి స్టార్ సిక్స్ ఫినిషర్స్‌గా నిలిచారు. ఇంతకు ముందు బోస్టన్, లండన్, చికాగో, న్యూయార్క్ నగరాల్లో నిర్వహించిన మారథాన్ పోటీల్లో పాల్గొని విజయవంతంగా పరుగును పూర్తి చేశారు.

కేయూ రిజిస్ట్రార్ దిగ్బంధం

● సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల డిమాండ్
● నాలుగు గంటల పాటు ఆందోళన



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని నాన్‌టీచింగ్ ఉద్యోగులు.. రిజిస్ట్రార్ మల్లారెడ్డిని దిగ్బంధించారు. తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేయూ ఎన్‌జీఓ , క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ యూనియన్లు ఆధ్వర్యంలో సోమవారం రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆందోళన చేపట్టారు. ప్రధానంగా 2013లో నియమాకమైన ఉద్యోగులకు పీఆర్‌సీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అదనపు పని కాలానికి అదనపు రెమ్యూనరేషన్ ఇవ్వాలన్నారు. 30 ఏళ్ల పనిచేసిన టైం స్కేల్ ఉద్యోగుల్లో ఎవరైనా మృతి చెందినా, లేదా విరమణ పొందినా ఆయా కుటుంబాలకు రూ. 5 లక్షల నుంచి రూ 10 లక్షలకు పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ పీఆర్‌సీ అమలుపై ఆడిట్ అధికారులతో ఈనెల 5న సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కరిస్తామన్నారు. కారుణ్య నియామకాలు, ఇతర సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు. అయితే ఎన్‌జీఓ సంఘం నాయకులు మాట్లాడుతూ నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని వారం క్రితం హామీ ఇచ్చి మళ్లీ దాటవేసే యత్నం చేస్తున్నారని వాగ్వాదానికి దిగారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆయా ఉద్యోగసంఘాల బాధ్యులు.. తన చాంబర్ నుంచి వెళ్లకుండా రిజిస్ట్రార్‌ను దిగ్బంధించారు. చివరికి పలు సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడంతో ఉద్యోగులు వెళ్లిపోయారు. కార్యక్రమంలో కేయూ ఎన్‌జీఓ సంఘం అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు వల్లాల తిరుపతి, ఎల్ యాదగిరి, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌షుకూర్, కొర్నేలు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి



రాజు(ఫైల్)

వాజేడు: గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని అయ్యవారి పేటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సుంకరి రాజు(20) తన స్నేహితులతో కలిసి గోదావరి నదిలోకి స్నానానికి వెళ్లాడు. నీటిలో దిగి స్నానం చేస్తూ లోపలికి వెళ్లాడు. లోతు తెలియక నీటిలో మునిగిపోతున్నాడు. దీనిని గమనించిన స్నేహితులు.. రాజును రక్షించడానికి కర్ర ఇవ్వగా దానిని అందుకోలే నీటిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు నాగేంద్ర కుమార్, శ్యామల, బంధువులు, గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. జాలర్ల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభించింది. రాజు మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్..



బోల్తాపడిన ట్రాక్టర్

కన్నాయిగూడెం: ట్రాక్టర్ నడుపుతున్న సమయంలో డ్రైవర్‌కు ఫిట్స్ రాగా వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కంతనపల్లి శివారులోని పాలమాకుల వద్ద జరిగింది. ఎస్సై సురేష్ కథనం ప్రకారం కన్నాయిగూడేనికి చెందిన బత్తుల నగేష్ సోమవారం మంగపేట మండలంలోని కమలాపురం నుంచి ట్రాక్టర్‌లో సెంట్రింగ్ మెటీరియల్ తీసుకుని కన్నాయిగూడెం వస్తున్నాడు. ఈ క్రమంలో పాలమాకుల వద్ద ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడగా అక్కడికక్కడే మృతి చెందాడు. నగేష్ మృతదేహాన్ని ఏటూరునాగారం మార్చురీ తరలించి పోస్టుమార్టం అనంతరం బాధితులకు అప్పగించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి పాల్పడిన ఏడుగురి మహిళలు అరెస్టు

మల్కన్‌గిరి: ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కేంద్రంలో ఉన్న పంచాయతీ కార్యాలయానికి చెందిన గోదాంలో చోరీకి పాల్పడిన తెలంగాణకు చెందిన ఏడుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణ నుంచి వచ్చిన మహిళలు కలిమెలలో పగటి సమయంలో పాత్రలు, తదితర సామగ్రి అమ్ముకుంటూ వేర్వేరు స్థావరాల్లో తలదాచుకునేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం సెలవు కావడంతో సిబ్బంది ఎవరూ ఉండరని గమనించి స్థానిక పంచాయతీ కార్యాలయానికి చెందిన గోదాంలో సిలిండర్లు, పైపుల చోరీకి యత్నించారు. అయితే ఓ స్థానిక మహిళ చూసి వెంటనే అధికారికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. దీంతో ఆ అధికారి సుకుమార్ ప్రధాన్.. పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే కలిమెల ఐఐసీ చంద్రకాంత్ తండి తన సిబ్బందితో వెళ్లి చోరీకి పాల్పడుతున్న మహిళలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీ చేసిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు మండలం బండారుపల్లికి చెందిన దాసరి నాయమ్మ, కరీంనగర్ జిల్లా సిరిపురం పీఎస్ పరిధి దుబ్బపల్లికి చెందిన దాసరి రెబికా, కందల సుభ్రత, కొత్తగూడెం జిల్లా చీరాల పీఎస్ పరిధి చీరాలకు చెందిన కందల మహేశమ్మ, కందల తిరుపతమ్మ, మంచిర్యాల జిల్లా ఉట్నూరు పీఎస్ పరిధి లక్ష్మయిపేటకు చెందిన బల్లని వెంకటమ్మ, ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు పీఎస్ పరిధి జనగాపల్లికి చెందిన వనం రేణుక ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

ఆర్టీసీ దసరా లక్కీ డ్రా విజేతల ఎంపిక



లక్కీ డ్రా తీస్తున్న ప్రయాణికురాలు, చిత్రంలో ఆర్ఎం శ్రీలత

హన్మకొండ: దసరా పండుగను పురస్కరించుకుని టీఎస్ ఆర్టీసీ ప్రవేశ పెట్టిన లక్కీ డ్రాకు సంబంధించి సోమవారం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్‌లో వరంగల్ ఆర్ఎం జాన్సి శ్రీలత సమక్షంలో విజేతలను ఎంపిక చేశారు. ప్రయాణికుల చేతుల మీదుగా డ్రా తీయించారు. గత ఏడాది అక్టోబర్ 18 నుంచి 30వ తేదీ వరకు బస్సుల్లో ప్రయాణించిన వారు తమ టికెట్లను బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బాక్సుల్లో వేయగా.. డ్రా ద్వారా పురుషులు, మహిళలను వేర్వేరు విజేతలుగా ప్రకటించారు. మహిళల్లో ఎస్.విజయలక్ష్మి(ఫోన్ నంబర్ 6300714827), కె.శ్యామల(ఫోన్ నంబర్ 6281690313), సీహెచ్.జయ(ఫోన్ నంబర్ 9515929289), సోనియా(ఫోన్ నంబర్ 8639596508), కోరె అస్మిక(ఫోన్ నంబర్ 7673979045), పురుషుల్లో జె.రాజు(ఫోన్ నంబర్ 9652982257), మోర మార్కండేయ(ఫోన్ నంబర్ 9985032704), బి.వెంకన్న(ఫోన్ నంబర్ 9652713975), ఇ.అనిల్(ఫోన్ నంబర్ 9381417522), ఎస్.శ్రీనివాస్(ఫోన్ నంబర్ 9848768530) బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ జె.శ్రీలత మాట్లాడుతూ లక్కీ డ్రా వంటి కార్యక్రమాలు సంస్థకు, ప్రయాణికులకు మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. ఈ లక్కీ డ్రా విజేతలకు రూ.9,900 నగదు బహుమతి అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కేశరాజు భానుకిరణ్, వరంగల్–1 డిపో మేనేజర్ వంగాల మోహన్‌రావు, సూపర్‌వైజర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో మిర్చి బస్తాల అపహరణ



మాట్లాడుతున్న రైతులు జలేందర్, తిరుమలయ్య

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో తేజరకానికి చెందిన 6 మిర్చి బస్తాలు అపహరణకు గురయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధిత రైతుల కథనం ప్రకారం.. నెల్లికుదురు మండలం ఆలేరుకు చెందిన రైతు పటేరు జలేందర్ తేజరకం మిర్చి 4 బస్తాలు, తాలు రకం మిర్చి 2 బస్తాలు, తారక తిరుమలయ్య అనే రైతు తేజారకం మిర్చి 2 బస్తాలు, తాలురకం మిర్చి 2 బస్తాలు విక్రయించేందుకు గత నెల 28వ తేదీన మార్కెట్‌కు తీసుకువచ్చారు. అయితే తేజరకం మిర్చికి గిట్టుబాటు ధర పడకపోవడంతో, తాలు రకం మిర్చినే ఆ ఇద్దరు రైతులు అమ్ముకున్నారు. కాగా, మిగిలిన 6 బస్తాలను(తేజారకం) ఆ ఇద్దరు రైతులు యార్డులోనే ఉంచి, అదే రోజు రాత్రి ఇంటికి వెళ్లారు. తిరిగి మరుసటి రోజు వచ్చి చూడగా మిర్చి బస్తాలు లేకపోవడంతో మార్కెట్ అధికారులు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు రూ.60వేల విలువైన 6 మిర్చి బస్తాలు అపహరణకు గురై 5 రోజులు కావొస్తున్నా తమ మిర్చి బస్తాలు ఎలా అపహరణకు గురయ్యాయో చెప్పడంలేదని సోమవారం విలేకరులకు చెప్పారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలంటూ ఆ ఇద్దరు రైతులు వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆ రైతులు బస్తాలు ఉంచిన యార్డులో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని మార్కెట్ అధికారులు చెబుతున్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

● 4 తులాల బంగారం అపహరణ
● కేసముద్రంలో ఘటన



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

కేసముద్రం: తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం.. కేసముద్రంస్టేషన్‌కు చెందిన మున్వర్ తన కుటుంబ సభ్యులతో కలిసి మానుకోటకు వెళ్లాడు. అదే విధంగా ఓ కంపెనీ కూల్‌డ్రింక్స్ డీలర్ హఫీజ్ వరంగల్‌లోని ఓ ఆసుపత్రిలో తన తల్లిని చూపించడానికి వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం ఇంటికి వచ్చి చూశాక ఆయా ఇళ్లకు వేసిన తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి, వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని పరిశీలించారు. మున్వర్ ఇంట్లో 4 తులాల బంగారం, కొంత నగదును అపహరించినట్లు గుర్తించారు. కాగా, హఫీజ్ ఇంట్లో విలువైన వస్తువులు అపహరణకు గురికాలేదని ఎస్సై తెలిపారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఒకే బజారులో ఉన్న రెండు ఇళ్లలో చోరీకి పాల్పడింది ఒకరేనని పలువురు అనుమానిస్తున్నారు.

ఐదో రోజు ఆదాయం రూ. 9.67 లక్షలు

● కొనసాగుతున్న మేడారం హుండీల లెక్కింపు



హుండీలలో లభించిన నగదు లెక్కిస్తున్న దేవాదాయశాఖ సిబ్బంది

హన్మకొండ కల్చరల్: హనుమకొండ లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర హుండీ లెక్కింపు కొనసాగుతుంది. లెక్కింపులో భాగంగా ఐదో రోజు సోమవారం ఉదయం 76 ఐరన్‌హుండీలను లెక్కింపు జరపగా రూ. 93,67,000 ఆదాయం లభించింది. నాలుగు రోజుల నుంచి నిర్వహించిన లెక్కింపులో లభించిన ఆదాయం రూ. 10,32,03,000 కాగా ఐదో రోజు లెక్కింపులో రూ. 93,67,000 ఆదాయం లభించిందని మేడారం ఈఓ రాజేంద్రం తెలిపారు. ఐదు రోజుల నుంచి 481 హుండీలను లెక్కించగా రూ. 11, 25,70,000 ఆదాయం లభించిందని, దీనిని బ్యాంకులో జమ చేశామని తెలిపారు. జాతర ఏర్పాటు చేసిన మొత్తం హుండీలు 518తో పాటు తిరుగువారం 22 హుండీలు ఏర్పాటు చేశామని, దీంతో మొత్తం 540 హుండీలకు గాను సోమవారం వరకు 481 హుండీల లెక్కింపు పూర్తయిందని తెలిపారు. అలాగే, నాణెల లెక్కింపు చేపట్టలేదని, లభించిన బంగారం, వెండి ఆభరణాలను హుండీలో భద్రపర్చామని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ రాష్ట్ర దేవాలయాల జ్యూలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ కట్టా అంజనీదేవి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాల పెట్టె పేరుతో డబ్బు వసూళ్లు




మంత్రపు పెట్టెను చూపిస్తున్న ఏసీపీ

జనగామ: మంత్రాల పెట్టె పేరుతో అమాయకుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ దామోదర్‌రెడ్డి తెలిపారు. జనగామ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సైలు సృజన్, శ్వేతతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఘటన వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్‌కు చెందిన లారీ డ్రైవర్ కేతావత్ శంకర్, నారాయణపేట జిల్లా మక్తల్ మండలం సంఘం బండకు చెందిన చికెన్ వ్యాపారి ఖాసీం, వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన ఎలక్ట్రీషన్ ఎండీ అజహర్, నల్లగొండ జిల్లా దిండి మండలం దేవత్‌తల్లి తండాకు చెందిన కొర్ర గాసిరాం ప్రస్తుతం హైదరాబాద్‌లోని హయత్‌నగర్ బంజారాకాలనీలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో కుటుంబ పోషణకు డబ్బులు సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఆకాశం నుంచి ఉల్కలు పడిన సమయంలో శక్తులు ఉన్న పెట్టె దొరికిందని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ పెట్టెను రూ.50 కోట్లకు అమ్ముడుపోలా ప్లాన్ చేసుకుని వరంగల్‌కు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేస్తారనే సమాచారం మేరకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. పెట్టె కొనుగోలు చేస్తే కోటీశ్వరుడివి అవుతావని సదరు వ్యక్తిని నమ్మించారు. అనంతరం నలుగురు.. పెట్టెను తీసుకుని హైదరాబాద్ నుంచి ఓ వాహనంలో వరంగల్ బయలుదేరారు. ఈ క్రమంలో జనగామ మండలం పెంబర్తి వై జంక్షన్ వద్ద ఎస్సై సృజన్, పీసీ బి.కర్ణాకర్, టి.రామన్న వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు తమ వాహనాన్ని వెనకకు తిప్పే క్రమంలో పట్టుబడ్డారు. దీంతో వారి నుంచి పెట్టె, వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని డీసీపీ సీతారాం, ఏసీపీ దామోదర్‌రెడ్డి అభినందించారు.

హరిత, నీలి విప్లవాలతో మరింత అభివృద్ధి

● కొండా లక్ష్మణ్ ఉద్యాన యూనివర్సిటీ వీసీ డాక్టర్ నీరజ ప్రభాకర్



మాట్లాడుతున్న నీరజ ప్రభాకర్

ఎంజీఎం : పంచభూతాలతో ఏర్పడిన ప్రకృతిని ఆసరా చేసుకుని చేపట్టిన హరిత విప్లవం, నీలి విప్లవాలను అనుసంధానించి మరింత అభివృద్ధి సాధించవచ్చని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజ ప్రభాకర్ అన్నారు. సోమవారం వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల ఎన్ఆర్ఐ భవన్‌లో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన యూనివర్సిటీ, జస్ట్ అగ్రికల్చర్ విద్యాసంస్థలు, ఎస్ఆర్ యూనివర్సిటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 6వ ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్స్ అడ్వాన్సెస్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ (హిటాస్–2024) కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి ప్రసంగించారు. ఉద్యాన పంటల ప్రాధాన్యతను వివరిస్తూ నేటి ప్రపంచ అవసరాలను తీర్చడానికి ఆధునిక పద్ధతులను అవలంబిస్తూ సుస్థిర లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల నేటి తరంలో వ్యవసాయ రంగంలో వచ్చిన ఆధునిక శాస్త్ర, సాంకేతికత విస్తృతం అవుతుందని చెప్పారు. భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించడానికి వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయి ఉపాధి రంగంగా ప్రపంచ వ్యాప్తం చేయడానికి ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనరెడ్డి, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ భూపాల్‌రాజ్, డాక్టర్ బి.పి.ఎస్ బద్వాల్, జస్ట్ అగ్రికల్చర్ విద్యా సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ సుశీల హుడ, వ్యవసాయరంగ శాస్త్రవేత్తలు, పీజీ, పీహెచ్‌డీ, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.